# బలి

"బాబూ! చక్రవర్తీ! ఉద్యోగంలో చేరావా" అంది ఆయాసపడుతూ కమలమ్మ ప్రొద్దుటనగా ఉద్యోగంలో చేరాలని వెళ్ళిన కొడుకు అప్పుడే ఇంట్లో అడుగు పెట్టాడు.

"ఆ! చేరానమ్మా!" అంటూ ఎంతో సంతోషంగా తల్లిని సమీపించాడు. కుక్కినులక మంచంమీద ఆయాసపడుతున్న తల్లిని చూడగానె సంతోషంకాస్తా మాయమైంది. ఆ స్థానంలో కొండంత భయం సముద్రమంత దుఃఖం చుట్టుకున్నాయి. మెల్లిగా వెళ్ళి తల్లిపక్కలో కూర్చునాడు. ఆప్యాయంగా ఆమె మీద చెయ్యివేసి.

"ఎలావుందమ్మా!" అనడిగాడు చక్రవర్తి. అతను అడిగిన దానికి సమాధానం చెప్పకుండా అతని ఒళ్ళు ఎండిపోయిన చేతులతో నిమురుతూ.

"ఎలావుంది వుద్యోగం" అంది ఆతృతగా కొడుకుకేసి చూస్తూ.

"ఉద్యోగం చాలా బాగుందమ్మా! పెద్దపనేమి కాదు. హాయిగా కుర్చీలో కూర్చోడం. లెక్కలు రాసుకోడం. ఎవ్వరితో మాట్లాడక్కరలేదు. పైగా జీతం మూడొందలమ్మా!" అన్నాడు గుక్కతిప్పకోకుండా!

ఆ మాటలు ఆమె గుండెలో పన్నీటిజల్లును కురిపించాయి. ఆ మాటకోసమే తను ఎదురుచూస్తోంది. శుష్కించిన ఆమె ముఖం కొత్త కాంతితో వెలిగిపోయింది.

"నువ్వు నిజంగానె యిప్పుడు చక్రవర్తివిరా" అంటూ కొండంత సంతోషంతో అతని చెయ్యి ముద్దుపెట్టుకుంది. ముఖం రెండు చేతులతో వంచి నుదురు చుంబించింది. కొడుకు ఉబ్బి తబ్బిబ్బైపోయాడు, కాని అంతలోనే ఆమె ముఖం మాడిపోయింది. కళ తప్పిపోయింది. ఆయాసం మరింత ఎక్కువైంది. కారణం ఆ చిన్నవానికి తెలియలేదు!

తల్లి పడేబాధ చూడలేక "అమ్మా! డాక్టర్ని తీసుకొస్తానమ్మా" అన్నాడు దీనంగా.

"ఒద్దు! నాయనా! ముందు నువ్వెళ్ళి అన్నంతినిరా! పొద్దుటనగా రెండు మెతుకులు తిని వెళ్ళావు" అంది అతికష్టంగా.

"అలా అనకమ్మా! ఈరోజు నాకు వుద్యోగం వచ్చిందని తెలీగానె ఎంతోమంది నన్నుచూసి ముఖం చాటేసుకున్నవాళ్ళే పలకరిస్తున్నారు. 'నీ తల్లిని సుఖపెట్టరా' అని సలహాలు కూడా యిస్తున్నరమ్మా! నా జీతం మూడొందలని తెలిస్తే డాక్టరు కూడా పరుగెత్తుకొస్తాడమ్మా!" అన్నాడు ఆతని ముఖంలో ఏదో సంతృప్తి, ఆ మాటలో ఏదో ధైర్యము ఆ తల్లికి కనపడ్డాయి. ఆతల్లి వాటికోసమె ఎదురుచూస్తోంది. తమకు ఆస్తిలేదని, ఎవరు దిక్కులేరని కొడుకును చిన్నచూపు చూసేది సమాజం. తన కొడుకింక తలెత్తుకు తిరుగుతాడు, ఇంకతాను నిశ్చింతగా వెళ్ళిపోవచ్చు. తానింక బ్రతక నవసరంలేదు కాని కొడుకుని వదలి వెళ్ళిపోతాననుకోగానె కడుపులోనుంచి పొంగి వచ్చింది దుఃఖం. కళ్ళు దాచుకోలేక వర్షించాయి, కొడుకు చూడకుండా కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"బాబూ ముందు అన్నం తినరా! తర్వాత డాక్టర్ని తీసుకు వద్దువుగానిలే" అంది ఆప్యాయంగా. మెల్లిగా లేచాడు చక్రవర్తి.

నూతిదగ్గరకు వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కుని వచ్చాడు. పొద్దుట సంగతిని పక్కకుపెట్టి మూతపెట్టుకున్న అన్నంగిన్నె, పచ్చిపులుసు గిన్నెతెచ్చి తల్లి మంచానికి దగ్గరగా పెట్టుకున్నాడు. స్టీలు కంచం, మంచినీళ్ళ చెంబు తెచ్చుకున్నాడు. ఉట్టిమీద పెట్టుకున్న మజ్జిగగిన్నె దింపుకున్నాడు. అన్నం కలుపుకొని తినడం ప్రారంభించాడు.

తల్లి మూలుగు సన్నగా వినబడుతోంది. తలెత్తి తల్లి కేసిచూశాడు. చెప్పలేని దుఃఖం ముంచుకొచ్చింది. ఆయింట్లో తల్లి అలా పడుకుని మూలగడం తనకు తెలీదు. తనకు జ్ఞానమొచ్చాక తల్లితప్ప ఆ యింట్లో ఎవ్వరూ మసలడం తెలీదు. తల్లి బ్రతుకుతుందో లేదో. తనకు దక్కుతుందో లేదో. తల్లి లేకుండా తాను బ్రతకగలడా! తన అదృష్టమెట్లావుందో! ఏమైన ఇంక వైద్యం చేయించాలి. ఎంతడబ్బు ఖర్చైన తనకింక భయంలేదు. ముద్ద నోట్లో పెట్టుకోకుండానే అలాగె ఆలోచిస్తూ వుండిపోయాడు ఆ కొడుకు.

"బాబూ! చక్రవర్తీ! అన్నం తిన్నావా!" అంది తల్లి. అలా చక్రవర్తీ అని ఎన్నోసార్లు పిలుచుకొని సంబరపడుతుందా తల్లి. తను దగ్గర కూర్చుని వడ్డించి కొసరి కొసరి తినిపించేది. ఈనాడు వాడే వండుకుని వడ్డించుకొని తినవలసి వచ్చిందని ఆమె బాధఅంతా. తాను వెళ్ళిపోతోంది. ఇంక అలవాటు కావాలి తప్పదు. అందుకే మొండిధైర్యం తెచ్చుకుంటోంది. అంత బాధను గుండెలోనె దాచుకొంది. ఆ గుండెలు ఆ బాధను తట్టుకోలేక మరింత ఎగసి పడుతోంది.

అంత పరధ్యాన్నంలోను ఆ కొడుక్కి తల్లి పిలుపు వినబడింది. ఆ పిలుపే తనకు కొండంత ధైర్యం. ఆ పిలుపే తనకు కొండంత అండ. ఆ పిలుపే తనకు శ్రీరామరక్ష. ఆ పిలుపుకోసమే తాను ఎదురు చూస్తాడు. ఆ పిలుపు వినగానె తాను ఎగిరిపడతాడు.

"ఆ! అయిపోయిందమ్మా!" అంటూ గబగబా తినడం ప్రారంభించాడు. కాని బెంగతో ముద్ద గొంతులోకి దిగలేదు. బలవంతంగా నాలుగు ముద్దలు మింగి మజ్జిగా అన్నంలోనె చేతులు కడుక్కున్నాడు. గిన్నెలు పక్కకు పడేసి తల్లి దగ్గరకు వచ్చాడు. "అమ్మా! డాక్టర్ని తీసుకొస్తానమ్మా" అన్నాడు దీనంగా. "చీకటి పడుతోంది. ఇప్పుడెక్కడికెడతావు. నా దగ్గర కూర్చో" అంది మాటలు తడబడుతూ.

"ఇంకా చీకటి పడలేదు. పక్కింటి మాలక్ష్మి పిన్నిని పిలిచి సాయంకూర్చోమంటానమ్మా" అన్నాడు దీనంగా.

"ఇప్పటివరకూ ఇక్కడేవుంది కదరా! మళ్ళా పిలుస్తావా" అంది కళ్ళు బలవంతంగా తెరుచుకుంటూ.

"నువ్వేమీ అనకమ్మా" అని అంటూనె సగం పడిపోయిన గోడదగ్గర కెళ్ళి పిన్నీ అని పిలిచాడు.

ఆ పిలుపు విని లోపలనుంచి పరుగెత్తుకొచ్చిన ఆవిడ చేతులు కొంగుతో తుడుచుకుంటూ "అమ్మకెలావుందరా" అంది.

"అలాగె వుంది. నేవెళ్ళి పెద్దడాక్టర్ని పిలుచుకొస్తా! నువ్వు అమ్మ దగ్గరవుండు" అంటూనె ఆమె సమాధానంకోసం ఎదురు చూడకుండా తల్లి దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

"నువ్వెళ్ళు త్వరగా" అంటూనె మహలక్ష్మి మొండిగోడ దూకి లోపలికొచ్చి కమలమ్మ పక్కలో కూర్చుంది.

"ఒస్తానమ్మ" అంటూ పరుగెత్తాడు చక్రవర్తి.

కొడుకు తిరిగి వచ్చేవరకు ఆ ప్రాణం ఆగుతుందో లేదో ఆవిడకే అనుమానం. కాని తనకు వైద్యం చేయించలేక పోయానని తను చచ్చిపోయాక బాధతడతాడేమో పిచ్చినాగన్న, వెళ్ళనీ" అనుకుంది తల్లి మనసులో. పక్కింటి మాలక్ష్మి చుట్టంకాక పోయినా అంతకంటె ఎక్కువగానె చూసుకొంటోంది. అన్ని కష్టాల్లోను నాఅన్న వాళ్ళెవ్వరూ వచ్చి తొంగిచూడకపోయినా శక్తివున్నంతలో ఆవిడే ఆదుకుంది ఆ తల్లీ కొడుకుల్ని. పక్కనే సీసాలోని మందు గ్లాసులోకి వంచింది. మెల్లిగా చెంచాతో కమలమ్మ నోట్లో పోసింది. రెండు చంచాలు మింగింది. తర్వాత మింగుడుపడలేదు. ఇంక వొద్దని సంజ్ఞ చేసింది. మెల్లిగా గుండెలు రాస్తూ కూర్చుంది మాలక్ష్మి.

కమలమ్మ భర్తకి వుద్యోగం ఉండేదికాదు. నలుగురి పిల్లలకు ట్యూషను చెప్పుకొనేవాడు. పెద్దింటివాళ్ళను ఆశ్రయించి వారికి రాతకోతలు చూసిపెట్టి సంపాదించేవాడు. సంసారం ఏ లోటు లేకుండా సాగిపోయేది పెద్దలు దగ్గరనుంచి పుచ్చుకొన్న చిన్న పాత పెంకుటిల్లు వుంది. ఒక మిద్దిపది, వంటిల్లు, వసారా, వీధి అరుగులు ఆయింట్లొ భాగాలు. చక్కగా మట్టి పేడతో అలుక్కొని ముగ్గు పెట్టుకొనేది. పసుపు రాసి కుంకుమబొట్లు పెట్టిన గడపలు, పచ్చని మామిడి తోరణాలతో గుమ్మాలు కలకలలాడుతూ వుండేవి. ఇరవైయేళ్లు నిండకుండానె కొడుకు

పుట్టాడు కమలమ్మకు. ముద్దుగా 'చక్రవర్తి' అని పేరుపెట్టు కొన్నారా దంపతులు. ఎంతో గారంగా పెంచుకుంటున్నారు.

కొడుక్కి మూడేళ్ళు రాకుండానె కమలమ్మ భర్త టైఫాయిడ్ జ్వరం వచ్చి చనిపోయాడు. నట్టేటి నావలా అయిపోయింది జీవితం. పుట్టింటి వారికి కమలమ్మను తీసుకువెళ్లి నాలుగు పూటలు తిండిపెట్టగల శక్తిలేదు. అత్తవారూ అంతే. తన బ్రతుకుతోపాటు తన కొడుకు బ్రతుకుకూడా చూడవలసివచ్చింది ఆమెకు.

చిన్నతనంలో చదువుకున్న చదువుప సాయం భర్త దగ్గర 8 వ తరగతి పుస్తకాలు చదువుకొంది. అందుకే భర్త చెప్పే ట్యూషన్లు పోకుండా పిల్లలకు తానే చెప్పడం ప్రారంభించింది. కాని ఇల్లు గడవడం కష్టమే అయింది అందుకే అప్పడాలు, వడియాలు ఇంట్లో తయారుచేసి అమ్మేది. విస్తరాకులు కుట్టి అమ్మేది. అవసరమైతే ఎవరింటికైనా వంట సహాయానికి వెళ్ళేది. సంసారం మళ్ళీ సాఫీగా సాగటం ప్రారంభించింది.

పిల్లవాడికి ఆరు సంవత్సరాలు రాగానె స్కూల్లో చేర్చింది. మెల్లిగా నాలుగు క్లాసులు వరకు వచ్చాడు. తానుకూడా ఇంట్లో చదివించేది. అందుకని స్కూల్లో మంచి మార్కులే తెచ్చుకొంటున్నాడు చక్రవర్తి. టీచర్లు అతన్ని ఎంతో ఆదరిస్తున్నారు. కాని రాను రాను చక్రవర్తిని తోటి స్నేహితులు హేళన చెయ్యడం ప్రారంభించారు.

"వీళ్ళమ్మ అప్పడాలు అమ్ముతుందిరా!

''వీళ్ళమ్మ విస్తళ్ళు కుట్టుతుందిరా"

"వీళ్ళమ్మ మా యింట్లో వంట చేస్తుందిరా"

"పీడేరా నిజమైన చక్రవర్తి" ఇలా రకరకాలుగా అతనిని ఏడిపించడం ప్రారంభించి వెంటపడి తరిమేవారు. చక్రవర్తి మొహం చిన్నబోయేది. అతని తలయావత్తు భూమిలోకి వంగి పోయేది. చక్రవర్తి ఎన్నడూ వాళ్ళను తిట్టలేదు. నిందించలేదు. అందుకే వాళ్లు మరీ లోకువకట్టారు. కాని ఇంటికొచ్చి తల్లి ఒళ్ళో పడి వెక్కి వెక్కి యేడ్చేవాడు. నేను స్కూల్లో చదవనని మారాము చేసేవాడు. ఆ తల్లి గుండె పగిలిపోయేది పిల్లవాడిని చూసి "అంతే అనుకోనీ బాబూ! వాళ్ళకు నువ్వు బాగా చదువుతావని కిట్టదు. నీ చదువు పాడుచెయ్యాలని చూస్తున్నారు. వాళ్లని లెక్కచెయ్యకు. బాగుగా చదువుకుంటె నీకు పెద్ద పుద్యోగం వస్తుంది. అప్పుడు నిన్ను చూసి అందరు సిగ్గుపడ తారు" అంటు చక్రవర్తికి ధైర్యం చెప్పేది.

అది నిజమే అనిపించేది అతనికికూడా.

క్రమంగా పిల్లలు ఆమె దగ్గరకు ట్యూషన్‌కి రావడం మానేశారు. పూట గడవటం కష్టమైంది. ఉన్నదాంట్లొనే జాగ్రత్తగా కొడుక్కి వండిపెట్టేది. చెంబుడు నీళ్ళు తాగి తాను కడుపు నింపుకొనేది.

పిల్లవాడు క్రమంగా పెద్దక్లాసులోకి వచ్చాడు. ప్రతి సంవత్సరం క్లాసుఫస్టు రావడంవల్ల హెడ్‌మాస్టరు స్కాలరుషిప్పు ఇప్పించాడు. ఆ డబ్బుతో పుస్తకాలు బట్టలుకొని పిల్లవాడిని స్కూలుకు పంపేది పదవతరగతిలోకి వచ్చాడు. "ఆ ఒక్క సంవత్సరం పూర్తి అయితే తన కష్టాలు గట్టెక్కుతాయి. తన కోరిక ఫలిస్తుంది. పిల్లవానికి ఉద్యోగమొస్తుంది" అని మురిసి పోయేది ఆ తల్లి.

ఆ సంవత్సరం పడ్డ భారీ వర్షాలకి వసార వంటగది కూలిపోయాయి. వీధి అరుగులు, మిద్దిగది మాత్రమె మిగిలాయి. ఆ ఒక్క గదిలోనె ఒక వారగా వండుకొని తినేవారు ఆ తల్లీ కొడుకులు. పడుకోడానికి ఒక కుక్కనులక మంచం. పాత పట్టీ మంచం వున్నాయి. రెండురోజుల కొకసారి బిషించుకొంటూ వాటి మీద నడుం వాల్చేవారు.

ఏదో విధంగా ఆ సంవత్సరం గడిచింది. పదవతరగతి పరీక్షా ఫలితాలు వచ్చాయి. చక్రవర్తి మంచి మార్కులతో పాసయ్యేడు. ఆమె పడ్డ శ్రమ, కష్టం ఫలించాయి. కనపడ్డవా రందరికి చెప్పింది. పరమాన్నం చేసి పక్కింటి మాలక్ష్మిని కూడా పిలిచి పెట్టింది. చక్రవర్తి సంతోషానికి పట్టపగ్గాలే లేవు. పెద్ద వుద్యోగం దొరికినంత సంబరపడ్డాడు.

కాని ఆ సంతోషం ఎక్కువ రోజులు నిలువ లేదు. ఉద్యోగం దొరికే దారి తెలియలేదు. గ్రామంలో పెద్దలు అన్న వాళ్ళందరి కాళ్ళు పట్టుకొన్నాడు. కాని ప్రయోజనం లేక పోయింది. పదిహేను సంవత్సరాల పసివానికి వుద్యోగమేమిటని అందరు పరిహాసం చేశారుకూడా. కనీసం కోవల టీకొట్టులో పద్దురాసే వుద్యోగంకూడా దొరకలేదు. చెప్పలేని నిరుత్సాహం తల్లీ కొడుకులిద్దరిలో చోటు చేసుకొంది. "ఊళ్ళో ఎక్కడైనా ఖాళీలొస్తే చూద్దాములే బెంగపడకండి" అంటూ మాలక్ష్మి వూరడించేది.

తల్లికే సహాయపడటం ప్రారంభించాడు. పొగలల్లా కష్టపడితే ఇద్దరి పొట్టలు నిండటమే కష్టమైపోయేది. కాలం బరువుగా కదులుతోంది.

ఒకనాడు పక్కింటి మాలక్ష్మి పరుగెట్టుకొని వచ్చి కమలమ్మా! హైస్కూల్లో క్లర్కుపోస్టు ఖాళీవుందట" అంది. ఆ మాటలు విన్న వెంటనే ఎగిరి గంతేశాడు చక్రవర్తి. ఆ తల్లి కొడుక్కు వుద్యోగం వచ్చినంత సంబరపడింది.

"అప్లికేషన్ పెట్టాలిట మా అబ్బాయి చెప్పాడు" అంది తిరిగి మాలక్ష్మి.

"అలాగా అక్కయ్యా! అలాగె పెట్టిస్తాలే" అంది.

ఇంత కాఫీచేసి ఆవిడకు కొడుక్కి ఇచ్చింది. మిగిలింది తాను తాగింది. వెంటనే కొడుకును ఇంటికెదురుగా వున్న టీచరింటికి పంపించింది. అప్లికేషన్ రాయించుకురమ్మని.

చక్రవర్తి అప్లికేషన్ ఎలా రాయాలో నేర్చుకొన్నాడు. వెంటనే స్కూల్లోఇచ్చి హెడ్‌మాష్టారి కాళ్ళు పట్టుకున్నారు. చక్రవర్తి అంటే అతనికి చెప్పలేని అభిమానం. కాని ప్రెసిడెంటు ఆజ్ఞ లేనిదే తానేమీ చెయ్యలేడు. ఆ విషయమే చక్రవర్తితో చెప్పి "నాకు చేతనైన సహాయం తప్పకుండా చేస్తాను. కాని ప్రెసిడెంటు గారిని కలుసుకోవడం మాత్రం మర్చిపోకు" అని పంపించాడాయన.

ఇంటికొచ్చి ఆ విషయమే తల్లితో చెప్పాడు. కాని చక్రవర్తికి ప్రెసిడెంటు అంటే తగనిభయం. బుంగమీసాలు ఆజానుబాహుమనిషి. చేతిలో పొన్నుకర్ర తిప్పుకుంటూ పోతుంటే యమధర్మరాజులా కనబడతాడు చక్రవర్తి కళ్ళకు.

"నాకు భయమమ్మా! నువ్వుకూడా రా" అన్నాడు.

ఇన్నాళ్ళు మగవారి కంటపడకుండా బ్రతికింది. ఇప్పు డెళ్ళి ప్రెసిడెంటు ఎదురుపడాలంటే ఆమెకు భయమేసింది. అందుకే మాలక్ష్మిని పిలిచి సలహా అడిగింది.

"ఫరవాలేదే అమ్మా! వెడితే. ఈరోజుల్లో ఆశ్రయిం చందే ఏపనీ జరగదు" అంది.

"నిజమే ఇది దాటిపోతే కొడుక్కి మరి వుద్యోగం ఖాళీయే లేదు. వాడికంటె ఎక్కువైంది యీ ప్రపంచంలో ఏదీలేదు" అనుకొని వెళ్లటానికే నిశ్చయించుకుంది. ఉన్నవానిలో మంచి జత బట్టలు తీసి కొడుకుని కట్టుకోమంది. తానుకూడా కాస్త బాగున్న చీరతీసి కట్టుకొంది. భుజాల చుట్టూ నిండుగా కొంగు కప్పుకుని కొడుకు వెంట బయలుదేరింది.

వీధి అరుగుమీదే ప్రత్యక్షమయ్యాడు ప్రెసిడెంటు. మర్యా దగా ఇద్దరూ వంగి చేతులెత్తి "నమస్కారమండీ" అన్నారు.

"నమస్కారం. నమస్కారం" అన్నాడు ప్రెసిడెంటు.

ఇద్దరు చేతులు కట్టుకుని దూరంగా నుంచున్నారు.

"ఏటి ఇలా వొచ్చావు" అన్నాడు కుర్చీలో కూర్చునే చేతిలో చుట్టతో చక్రవర్తికేసి చూస్తూ.

"క్లర్కుపోస్టు హైస్కూల్లో ఖాళీవుంది. అప్లికేషన్ పెట్టాను. నాకు ఇప్పించాలి" అన్నాడు చక్రవర్తి నోరు పెగ ల్చుకొని.

"అవును బాబు నానా కష్టాలు పడుతున్నాము. ఈ వుద్యోగం నా కొడుక్కి యిప్పించి పుణ్యం కట్టుకోండి. ఆజ న్మంతం మీకు ఋణపడి వుంటాం" అంది కమలమ్మ.

"ఎవరూ ఈమె మీ అమ్మేటి" అన్నాడు ఎగా దిగా చూస్తూ.

"అవునండి మా అమ్మగారు కమలమ్మగారు" అన్నాడు చక్రవర్తి.

"చెప్పుకోడమే కాని నేనెప్పుడూ సూడలేదు. అది సరే కాని ఇదిగో మీరిట్టా నాచుట్టూ తిరగడం నే సయించను. నేనే కబురు పెట్టిత్తాను. ఇకెళ్ళండి అన్నాడు చాలా అప్యాయంగా.

తల్లీకొడుకులు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బై పోయారు.

"ఈ జన్మలో మీ ఋణం తీర్చుకోలేము బాబూ" అంటూ మరోసారి ఇద్దరు తండాలు పెట్టి యింటికి చేరుకున్నారు.

చెప్పినట్టుగానె నాలుగు రోజులు పోయాక చక్రవర్తిని పిలిపించాడు ప్రెసిడెంటు. ఆర్డర్సు నాలుగు రోజుల్లో వస్తాయని చెప్పాడు. రాజమండ్రి వెళ్ళి కూరలు, సరుకులు పట్టుకొని రమ్మని పంపించాడు. అతను బస్సు యెక్కి వెళ్ళాడని తెలియ గానె వచ్చి వంటచెయ్యమని కమలమ్మకు కబురు పెట్టాడు. కమ లమ్మ కొండంత వుత్సాహంతో పరుగెత్తుకొచ్చింది.

"నీ కొడుక్కి నాలుగురోజుల్లో ఆర్డర్సు వస్తున్నాయి. లోపలకెళ్ళి వంటపని చూసుకో" అన్నాడు.

సంతోషం పట్టలేని కమలమ్మ తడబడే అడుగులతో వంటింట్లో ప్రవేశించింది. వీధి తలుపులు మూసి తనవెంటే వస్తున్న ప్రెసిడెంటును ఆవిడ గమనించనేలేదు. పెద్ద పులిలా వెళ్ళి ఆమె మీద పడ్డాడు. అదిరిపడిన ఆమె

"బాబూ వదలండి" అంటూ బ్రతిమాలింది. గోలపెట్టింది గుండెలు కరిగేలా యేడ్చింది. ఆ రాతిగుండె కరగలేదు. తప్పించుకోవాలని పెనుగులాడింది. చివరకు ఓడిపోయింది. ఆ కామాంధుని చేతుల్లో ఇరుక్కుపోయింది. కరువుతీరా అనుభవించాడు. అలసిపోయి వదలివేశాడు.

కమలమ్మ గుండె చెదరిపోయింది. ఆమె దేహం మలినమైపోయింది. వెంటనే చచ్చిపోవాలనుకుంది. కాని అంతలోనె తాను చచ్చిపోతే కొడుకు వుద్యోగం ఏమవుతుందో. వాడి ఆర్డర్సు కంట పడాలి. మెల్లిగా చీర సద్దుకొని ఒళ్ళు స్వాధీనం చేసుకొని లేచింది నీరసంగా నడుస్తూ ఇంటికి చేరింది.

తలారా స్నానం చేసింది. భర్త ఫోటో దగ్గరకెళ్ళి వెక్కి వెక్కి యేడ్చింది. తనను క్షమించమని వేడుకొంది. మైలు పడ్డ ఆ శరీరం నసించిపోవాలి. అగ్నే తన శరీరాన్ని సుద్ది చెయ్యాలి. ఆనాటినుంచి మరి భోజనం చెయ్యలేదు. కాఫీ నీళ్ళతో కడుపు నింపుకొని కాలక్షేపం చెయ్యడం ప్రారంభించింది.

సాయంకాలం తిరిగి వచ్చాడు కొడుకు. ఎంతో సంతోషంతో ఇంటిలో అడుగు పెట్టాడు. తల విరమోసుకొని చాపేసుకుని నేలమీద పడుకొన్న తల్లిని చూసి ఆశ్చర్యపోయాడు దగ్గరగా వచ్చి "అలావున్నావేం అమ్మా!" అన్నాడు.

"ఏం లేదురా!" అంది నిర్లిప్తంగా.

సంచిలోని కూరలు ఆవిడముందు పోశాడు.

"ఇవన్నీ ఎక్కడివి అని ఆవిడ అడక్కముందే" ప్రెసిడెంటుగారు పట్టుకెళ్ళమన్నారమ్మా! ఆయన ఎంత మంచివారో!"

అన్నాడు అమాయకంగా. నివురుగప్పిన నిప్పు ప్రెసిడెంటని ఆ కొడుక్కి ఏమితెలుసు అనుకొంది ఆతల్లి.

రోజులు గడుస్తున్నాయి. కమలమ్మకు రాత్రి జ్వరం తగలడం ప్రారంభించింది. నాలుగు రోజులకల్లా ఆర్డర్సు రానే వచ్చాయి. ఆ తల్లి కొడుకుల సంతోషం చెప్పలేనిది. కొడుకు బజారుకెళ్ళి స్వీట్సు పట్టుకొచ్చాడు. సంతోషంతో ఇద్దరు తిని పక్కింటి మాలక్ష్మిని పిలిచి ఇచ్చారు. ఆమెకూడా కష్టాలు గట్టెక్కినందుకు ఎంతగానో సంతోషించింది. నాలుగు రోజుల్లో డ్యూటీలో చేరాలి. ఇంక నాలుగు రోజులేకదా! నిమిషంలో గడుస్తాయి అనుకొన్నారు. ఆరోజు రాత్రి జ్వరం తీవ్రరూపం దాల్చింది. డాక్టర్ని పిలుస్తానంటే ఆమె ఒప్పుకోలేదు.

మర్నాడు పొద్దుట గవర్నమెంటు హాస్పిటల్‌కెళ్ళి మందు పట్టుకొచ్చాడు. ఆమె వద్దంటున్నా తాగించాడు. ఆరోజునుంచి మందులుతెస్తూనే వున్నాడు. బలవంతంగా తాగిస్తూనె వున్నాడు. ఏమాత్రం గుణం కనపడలేదు సరికదా రోజు రోజుకి పరిస్థితి దిగజారుతూనె వుంది.

ఆరోజే వుద్యోగంలో చేరాలి. తల్లి మరీ అనారోగ్యంగా వుంది. ఆమెను వదలి వెళ్ళాలని లేదు. పక్కింటి మాలక్ష్మి పిన్నిని సాయంగా వుండమన్నాడు. నాలుగు రోజులనుంచి తనే వండుకుంటున్నాడు. తనే వడ్డించుకుంటున్నాడు. తనే గిన్నెలు తోముకుంటున్నాడు. ముద్ద గొంతుకు దిగటంలేదు, ఒక పక్క చెప్పలేని బెంగ. మరో పక్క చెప్పలేని సంతోషం. తమ కష్టాలు గట్టెక్కుతాయి. తల్లిని కూర్చోపెట్టి చెయ్యాలి. ఆమెను సుఖ

పెట్టాలి. తల్లి బలవంతంమీదే హైస్కూలుకు బయలుదేరి వెళ్ళాడు ప్రొద్దుట చక్రవర్తి.

గతమంతా కళ్ళముందు మెదిలింది కమలమ్మకు. ''ఏమి టలా ఉన్నావు'' అంది పక్కనే కూర్చున్న మాలక్ష్మి.

ఆయాసంతో ఎగిసిపడుతోంది కమలమ్మ. నూతిలో నుంచి వస్తూన్నట్లు వస్తోంది మాట.

''నా పని పూర్తిఅయిందక్కా. నువ్వే నా కొడుకుని చూడాలి. వాడిని ఒక ఇంటివాడిని చెయ్యాలని అనుకున్నాను. కాని ఇంక నాకు టైములేదు. నీ మనుమరాల్ని ఇచ్చి పెళ్ళి చేసి దగ్గరుండి చూసుకో'' అంది మెల్లిగా తడబడుతూ.

''ఆ మాటలన్నీ ఇప్పుడెందుకే అమ్మా! నువ్వు కళ్ళు మూసుకొని పడుకో'' అంటూ ఆవిడ దుప్పటి సరిచేసింది.

''కళ్ళుమూసుకొంటే మరి తెరవలేనక్కా. బాబు వచ్చే వరకు ప్రాణాన్ని ఆపుకోవాలి'' అంది. కమలమ్మ కంఠం పూడుకుపోయింది. కళ్ళమ్మట నీళ్లు బొట బొటాకారాయి.

వచ్చే దుఃఖాన్ని గొంతులోనె ఆపుకొంది మాలక్ష్మి. పైకి రాకుండా నోట్లో కొంగు దోపుకుంది. చెప్పలేని బాధపడుతోంది కమలమ్మ. అదే మరణబాధ కాబోలు. ఒక పక్క మానసిక బాధ. మరోపక్క శారీరక బాధ. రెండింటితో కమలమ్మ మెలి కలు తిరిగిపోతోంది. భౌతిక దేహాన్ని వదిలి వెళ్ళటానికి ఆజీవుడు కూడా ఇంత బాధపడతాడు కాబోలు అని అనుకుంది మాలక్ష్మి.

అంతలో డాక్టర్ని వెంటపెట్టుకొని చక్రవర్తి వచ్చాడు.

"అమ్మా ! డాక్టరొచ్చారమ్మా!" అన్నాడు.

"కొడుకుని దగ్గరకు రమ్మని సంజ్ఞమాత్రం చేయగలిగింది ఆ తల్లి. పరుగెత్తుకొచ్చాడు "అమ్మా" అంటూ.

మెల్లిగా కొడుకు చేతిని అందిపుచ్చుకొంది. పక్కనున్న మాలక్ష్మి చేతిలో పెట్టగలిగింది. కొడుకు మొహంకేసి చూస్తూనె వుంది. తల పక్కకు పడిపోయింది.

తల్లి శవంమీద పడి చక్రవర్తి ఘొల్లుమన్నాడు. తన ఉద్యోగం కోసమే బలైపోయింది తన తల్లిఅని ఆఅమాయకునకు తెలియలేదు.

(స్వాతంత్ర్య మాసపత్రిక)